క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



తెనాలిఅర్బన్: ముప్వా పద్మావతి పుట్టిన రోజు సందర్భంగా ఆమె కుమారుడు మహేష్ ఆధ్వర్యంలో సోమవారం తెనాలిలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ తెనాలి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా నోటుపుస్తకాలు, స్టేషనరీని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో అనిల్ ప్రకాష్, తలతోటి సుధాకర్, నాగరాజు, మెహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తెనాలి: నవచైతన్య బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోర్టులు, సబ్ కలెక్టర్ కార్యాలయాల ఎదుట చలివేంద్రం ఏర్పాటుచేశారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ ప్రారంభించి, మజ్జిగను పంపిణీ చేశారు. న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, గుమ్మడి రవిచాజు, బవసయ్య, గంగాదేవి, టి.యలమంద, భీష్మ పావన్, సాంబశివరావు, న్యాయవాద గుమాస్తాలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విరామ బైబిల్ పాఠశాల



తెనాలి : విద్యార్థుల వేసవి సెలవుల దృష్ట్యా అయితానగర్ లోని బెరాకా ప్రార్థనా మందిరంలో గత పదిరోజులుగా జరిగిన వీబీఎస్ విరామ బైబిల్ పాఠశాల సోమవారంతో ముగిసింది. విద్యార్థులు ఏ విధంగా సన్మార్గంలో నడవాలి...చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గంలో ముందుకు సాగిపోయేలా ఉపాధ్యాయులు సూచించారు. చివరి రోజైన సోమవారం ప్రదర్శన నిర్వహించారు. బెరాకా స్థానిక దైవసేవకులు బ్రదర్ నాగరాజు, లూథర్‌పాల్, శామ్యూల్, భాగ్యరావు, సత్యనారాయణ, విజయరాజు, దేవసహాయం, కిషోర్, బాబ్జి, సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

నాట్కోలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సర్జికల్ ఆంకాలజి విభాగంలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు, రెండు రోజులు ఓపీ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో పలు విభాగాధిపతులతో సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ఓపీల మాదిరిగానే నాట్కో సెంటర్‌లో కూడా ఓపీ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలన్నారు. మధ్యాహ్నం కూడా ఓపీ నిర్వహించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రతి సోమ, గురువారం మెడికల్ ఆంకాలజి విభాగంలో కొత్త ఓపీ రిజిస్ట్రేషన్లు జరగాలని చెప్పారు. మంగళ, శుక్ర వారాల్లో రేడియేషన్ ఆంకాలజీలో రిజిస్ట్రేషన్లు, బుధ, శనివారం సర్జికల్ ఆంకాలజి రిజిస్ట్రేషన్లు జరగాలని తెలిపారు. మూడు వైద్య విభాగాలు సమన్వయంతో పని చేయాలనీ, ఒకరి ఎక్కువ మరొకరు తక్కువ అనే భావన రాకూడదన్నారు. 15 రోజులుగా సర్జికల్ విభాగంలో డీఈఓ రావడం లేదని ఆంకాలజి వైద్యులు వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుని రాగానే వెంటనే నోటీసు ఇచ్చి వేరే ఒకరిని నియమించాలని ఆదేశించారు. ఆరోగ్య మిత్రలు కూడా సక్రమంగా విధులకు హాజరు కావాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

232 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం హజ్ యాత్రకు వెళ్లే 232 మందికి ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. వ్యాక్సిన్ చేయించుకోవడం ద్వారా పోలియో, మెదడు వాపు, ఫ్లూ ఇతర వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి మందులు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారులు డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధి జగన్ కే సాధ్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్
- 35,36,37,40 వార్డుల్లో రోడ్డు షో
- శివకుమార్‌కు సంఘీభావం ప్రకటించిన ఆర్యవైశ్యులు



37వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే సత్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమని తెనాలి ఎమ్మెల్యే , వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గంగానమ్మపేటలోని గంగానమ్మ గుడి నుంచి సోమవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 35వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గొడవర్తి శ్రీ సాయి హరేరామ్, వార్డు నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తొలుత గంగానమ్మ గుడిలో పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి పలు వీధుల్లో రోడ్డు షో నిర్వహించారు. పార్టీ నాయకులు శివకుమార్‌కు భారీ గజమాలతో సత్కరించారు. అక్కడి నుంచి మార్వాడీ గుడి రోడ్డు మీదుగా 36వ వార్డుకు చేరుకున్నారు. వార్డు ఇన్ చార్జులు జి.హేమలత, కొలుసూరి నాగమల్లేశ్వరరావులు ఆయనకు ఘనస్వాగతం పలకగా వీధుల్లో రోడ్డుషో నిర్వహించారు. 37వ వార్డుకు చేరుకోగానే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మల్లిబోయిన సువర్ణ రేఖాదేవి, పార్టీ నాయకులు మల్లిబోయిన రాము దంపతులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పలు వీధుల్లో రోడ్డు షో నిర్వహించారు. అనంతరం 40వ వార్డుకు చేరుకోగానే మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, పార్టీ నాయకులు అత్తోట శ్యామ్ దంపతులు ఘనస్వాగతం పలికారు. ఇలా వార్డువార్డునా అన్నాబత్తునికి అపూర్వ ఆదరణ లభించింది. పలు వీధుల్లో మహిళలు హారతులిచ్చి దిష్టితీశారు. ఆర్య వైశ్య సంఘీయులు తమ దుకాణాల నుంచి బయటకు వచ్చి ఆయనకు మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌లు ఆలమూరి విజయలక్ష్మి కుమారి, దొడ్డక సీతామహాలక్ష్మి, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు మొగల్ అహ్మద్‌బేగ్, గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, ఎంపీటీసీ మైలా భాను, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, షేక్ జాకీరా, సేల్వీ, మన్నవ శాంతి శ్రీ, భాస్కరుని శ్రీనివాసరావు, బూరెల దుర్గా, కాళిదాసు వెంకటేశ్వరావు, పోతవరుపుల పురుషోత్తమ్మ శర్మ, ఏలూరి శేషగిరి, భరణి శ్రీనివాసరావు, ఆర్ల శ్రీను, ఆలమూరి ఫణీ, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ గఫార్, దేవరపల్లి కిషోర్, తాడిబోయిన పోలురాజు, కుక్కల ముక్తేశ్వరరావు, మట్లపూడి రాజేశ్వరరావు, ఉడుముల మహేష్‌రెడ్డి, పెసర్లంక రమణ, సిరి కృష్ణ, గొర్రెపాటి వేణుగోపాలరెడ్డి, ఎస్ఆర్కే శర్మ, తాడిబోయిన నాగార్జున, గోల్డ్ రహిమా, టిక్స్ బాల, సీకేరా రెడ్డి, చుండూరు సాయి, కొడాలి క్రాంతి, కొల్లా గురునాథ గుప్తా, శానంపూడి రఘురామిరెడ్డి, జిలానీ, బట్టా అంజిబాబు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



35వ వార్డులో అన్నాబత్తుని శివకుమార్‌ను భారీ గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు

తెనాలికి మనోహర్ ఏం చేశారో చెప్పాలి

పద్మశాలీయ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి : గతంలో పదేళ్లు ఎమ్మెల్యేగా, స్పీకరుగా వెలుగొందిన నాదెండ్ల మనోహర్ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని తెనాలి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. తెనాలిలో సొంతిల్లు ఉన్నా, గత పదేళ్లుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారని ఆయన గుర్తుచేశారు. పదేళ్లు మనోహర్ అధికారంలో ఉన్నపుడు ఇక్కడ ఏదైనా పరిశ్రమ స్థాపించారా? స్కిల్ ట్రైనింగ్ ఇప్పించారా? ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా? అనేది చెప్పాలని నిలదీశారు. స్థానిక ప్రగడ కోటయ్యనగర్‌లోని పద్మశాలీయ కళ్యాణ మండపంలో పద్మశాలీయ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడారు. ఈ ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధితో పాటు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఉద్యోగ మేళాలు నిర్వహించి, యువతకు ఉద్యోగాలను ఇప్పించానని ఆయన గుర్తుచేశారు. మేనిఫెస్టోలోని హామీలను అమలుచేసి మళ్లీ ప్రజల ముందుకు వచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధిని కొనసాగిస్తూ సంఘీయుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. నియోజకవర్గంలో గత అయిదేళ్లలో రూ.1800 కోట్ల సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్టు గుర్తుచేశారు. 27 వేల మందికి ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషను పత్రాలతో ఇచ్చామన్నారు. కేవలం పద్మశాలీయ వర్గీయులకే 4,628 మందికి సంక్షేమాన్ని అందించానని చెప్పారు. సొంత మగ్గం కలిగిన నేతన్నలకు చేనేత నేస్తం పథకం కింద రూ.24 వేల ఆర్థికసాయం అందించానని తెలిపారు.

కూటమి లక్ష్యం అధికారం

2014లో కలిసి పోటీచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ 2019లో ఎందుకు విడిపోయాయని, మళ్లీ ఇప్పుడు ఎందుకు కలిసి పోటీకి వస్తున్నాయనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. కేవలం అధికారమే లక్ష్యంగా ఆ పార్టీలన్నీ జట్టుకట్టాయన్నారు. 2014లో ఇచ్చిన హామీలను చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చనందునే 2019లో ప్రజలు టీడీపీని ఓడించి వైఎస్సార్‌సీపీకి 151 సీట్లను కట్టబెట్టినట్టు చెప్పారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు అవే అలవికాని హామీలతో మేనిఫెస్టోను తీసుకొచ్చారని శివకుమార్ విమర్శించారు. తమ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అవుతుందని విమర్శించిన ప్రతిపక్షాలు, ఇప్పుడు చంద్రబాబు ప్రకటించిన హామీలకు ఎన్ని శ్రీలంకలు అవుతాయని ప్రశ్నించారు. అవ్వాతాతలకు వలంటీర్ల ద్వారా ఇంటికే వచ్చి పింఛన్లు అందజేస్తుంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఓర్చుకోలేకపోయారని శివకుమార్ ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేయించి, పింఛనుదార్లను అవస్థలు పెడుతున్నారని చెప్పారు.

పార్టీ కండువాలు మీరు నేసినవే..

చేనేతలకు తాను ఎప్పుడూ అండగా ఉంటున్నానని ఎమ్మెల్యేగా గెలిచాక పార్టీ కండువాలను చేనేతతోనే చేయించుకున్నానని గుర్తుచేశారు. ఆ తర్వాత రాష్ట్రమంతా అవే వినియోగిస్తున్నారని చెప్పారు. ఎన్నికల పరిశీలకుడు/పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, పద్మశాలీయ సంఘ నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి రేపల్లె గేటు మూసివేత

తెనాలి రూరల్: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో తెనాలి-రేపల్లె రైలు మార్గం పట్టణ మారీసుపేటలోని రేపల్లె గేటును మంగళవారం నుంచి మూసివేయనున్నారు. రైల్వే గేటును సోమవారం నుంచి ఆరు రోజుల పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గేటును మూసి వేస్తామని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

డాక్టర్ సుందరరామయ్యకు ఘన నివాళి



తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వి. సుందరరామయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ సుందరరామయ్య సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. భవానిశంకర్‌కు ఐఎంఏ సభ్యులు డాక్టర్ సుందరరామయ్య స్మారక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు.

కార్యక్రమంలో వైద్యులు విజయలక్ష్మి, కె. అనిల్‌కుమార్, పాటిబండ్ల దక్షిణామూర్తి, పావని ప్రియాంక, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

బ్లేడ్‌తో దాడి, దోపిడీ

తెనాలి రూరల్: రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారిని బ్లేడుతో దాడి చేసి గాయపరిచి వారి వద్ద ఉన్న నగదును దోచుకెళ్లిన ఘటన ఆదివారం అర్ధరాత్రి తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... తెనాలి రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో వంతెన ఫుట్‌పాత్‌పై కొందరు నిద్రిస్తున్నారు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి నిద్రిస్తున వారి జేబులు వెతుకుతుండగా అప్పుడే భోజనం చేస్తున్న పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గురజాల కోటిబాబు(క్యాటరింగ్ పనులకు వెళుతుంటాడు) ఎందుకు వెతుకుతున్నారని ప్రశ్నించాడు. దీంతో అతడి వద్దకు వచ్చిన నలుగురు యువకులు బ్లేడుతో అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, అతడి వద్ద ఉన్న రూ.1,800, సెల్‌ఫోను లాక్కు వెళ్లారు. బాధితుడు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అతడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. పోలీసులు విచారిస్తున్నారు.

దివీస్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూలు



విద్యార్థులతో జూపూడి రంగరాజు, మధుసూదనరావు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ కళాశాలల్లో బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న 70 మంది విద్యార్థులు హాజరు కాగా, వారికి వివిధ దశల్లో ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. రాత పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులను ఎంపిక చేసిన దివీస్ ల్యాబ్స్ ప్రతినిధులు వారికి త్వరలో ఉద్యోగ నియామక పత్రాలు పంపున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, ఓఎస్డీ డాక్టర్ పి.సీ తారామయ్య అభినందించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చేందుకు సహకరించిన భార్య, హతమార్చిన ఆమె ప్రియుడు, మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం, ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రేమ్‌కుమార్(35) తన భార్య, పిల్లలతో బతుకు తెరువు నిమిత్తం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటూ మార్కెట్‌లో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. అతడి భార్య భారతీ లాలాపేట పూలమార్కెట్ సెంటర్‌లో సమోసాలు తయారు చేసే షాపులో పనికి వెళుతుంటోంది. ఈక్రమంలో షాపు యజమాని షేక్ గౌస్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్న క్రమంలో విషయం తెలిసిన ప్రేమ్‌కుమార్ తన భార్యను వారించాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో భర్తను హతమార్చేందుకు భారతీ పక్కా పథకం రచించింది. అప్పటికే పరిచయం ఉన్న గౌస్ గతనెల 28వ తేదీ రాత్రి ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని మాయమాటలు చెప్పి గౌస్‌తోపాటు తన తమ్ముడు ఖాశిం, అతని స్నేహితుడు రహమాన్ పథకం ప్రకారం ప్రేమ్‌కుమార్‌ను వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు పరిధిలోని ఖాళీ స్థలాల్లోకి తీసుకెళ్లారు. మద్యం తాగించి కర్రతో కొట్టి వెంట తెచ్చుకున్న కత్తులతో ప్రేమ్‌కుమార్ గొంతు కోసి హతమార్చారు. అనంతరం ప్రేమ్‌కుమార్ భార్య భారతీ తనకు ఏమీ తెలియనట్లు గతనెల 29వ తేదీన తన భర్త పెళ్లికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని, కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా భారతీ ప్రియుడు గౌస్‌తో కలిసి భర్తను హతమార్చినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిందితులు నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

తలసీమియాపై ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలి

గుంటూరు మెడికల్: భారతదేశంలో నాలుగు శాతం మంది జన్యుపరమైన కారణాలతో తలసీమియా వ్యాధి బారిన పడుతున్నారని సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ సెక్రటరీ, గుంటూరు వేదాంత హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ మంచికంటి అనూరాధ చెప్పారు. స్థానిక మంగళగిరి రోడ్డులోని వేదాంత హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులు ఇరువురిలో తలసీమియా కేరియర్స్‌గా ఉంటే 25 శాతం పుట్టే పిల్లలు తలసీమియా వ్యాధితో పుడతారని చెప్పారు. ప్రతి ఏడాది పదివేల మంది చిన్నారులు మేజర్ తలసీమియాతో జన్మిస్తున్నారని, వీరికి సకాలంలో రక్తం ఎక్కించడానికి అందుబాటులో దొరక్క ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. ఫీటల్ మెడి సిన్ ద్వారా గర్భంలోనే తలసీమియా సోకుతుందా లేదా అనే విషయాన్ని గుర్తించి నివారించవచ్చు అన్నారు. మే 8న వరల్డ్ తలసీమియా డే నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ తలసీమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి గర్భిణికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా తలసీమియాను కట్టడి చేయవచ్చు అన్నారు. ఫీటల్ మెడిసిన్ సొసైటీ ఏపీ అధ్యక్షురాలు డాక్టర్ కె.వి.శ్రీదేవి సహకారంతో తలసీమియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



సిబ్బందికి సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి రూరల్: తెనాలి కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రెండో రోజు నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెనాలిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్‌లకు ఈ నెల 8 వరకు ఇక్కడ రెండో విడత శిక్షణ జరుగుతోంది. దీంతో ఉద్యోగులు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ తెనాలిలో నివాసం ఉండే ఉద్యోగులూ పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళ, బుధ వారాల్లోనూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరగనుంది. మొదటి రోజైన ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో 314 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని తెనాలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడి ఇక్కడ ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వన్ టౌన్ సీఐ దశరథ రామారావు పర్యవేక్షించారు.

మంచి కోరే జగన్‌ను ఆదరించండి

ఎన్నికల ప్రచారంలో అన్నాబత్తుని సత్యనారాయణ



ఇంటింటి ప్రచారం చేస్తున్న సత్యనారాయణ చౌదరి, పార్టీ నేతలు

తెనాలి రూరల్ : అందరి మంచిని కోరే జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి ప్రజలను కోరారు. గ్రామీణ మండలం సంగంజాగర్లమూడిలో సోమవారం సాయంత్రం ఆయన పార్టీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారికి గత ఐదేళ్లలో అందించిన పథకాల ప్రయోజనాలను వివరించారు. 2019 ఎన్నికల సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసారన్నారు. రాజకీయాలపై ప్రజలకు విశ్వసనీయత కలిగేలా చేశారన్నారు. కరోనా సమయంలో దేశంలో పలు రాష్ట్రాలు ఆర్థిక భారంతో సతమతమైనా రాష్ట్రంలో మాత్రం సీఎం జగన్ సంక్షేమ పథకాల అమలు చేసి ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగే విధంగా చర్యలు చేపట్టారన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చి, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా పాలనను అందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేసి తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కె. భాస్కర్, రెడ్డి శ్రీను, నాగమోతు నాగేశ్వరరావు, యన్నం సుబ్బయ్య, పాలడుగు సాంబశివరావు, కె. శివరామిరెడ్డి, కె. గోపాలరెడ్డి, ఎస్‌కే యాసిన్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

12వ వార్డులో టీడీపీకి షాక్



ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో పార్టీలో చేరిన కంచర్ల రాజేష్, మిత్రబృందం

తెనాలి: పట్టణ 12వ వార్డులో టీడీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన వార్డు ప్రధానకార్యదర్శి కంచర్ల రాజేష్ తన మిత్రబృందం 30 మందితో కలసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శివకుమార్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో హనుమంతరావు, స్వామి, రాజేష్ నాయక్, బాలానాయక్, బాబూరావు, సాంబయ్య, రత్నకుమార్, సయ్యద్ అమీర్, చంద్రశేఖరరావు తదితరులున్నారు. వీరితో పట్టణ 15 వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు కూడా ఉన్నారు.

భూహక్కు చట్టంపై కూటమి నేతల విషప్రచారం

- ఈ చట్టం ఇంకా అమలులోకి రానేలేదు
- భూముల సమగ్ర రీసర్వే పూర్తయ్యాకనే ఆలోచన
- తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్



మాట్లాడుతున్న బేతాళ ప్రభాకర్

తెనాలి: భూహక్కు చట్టం(ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్)పై టీడీపీ, జనసేన పార్టీలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు ఆరోపించారు. చట్టం ఇంకా అమలులోకి రాకముందే ప్రభుత్వ పరిశీలనలో ఉండగానే ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలనే దురుద్దేశంతోనే విషప్రచారం చేస్తున్నాయని చెప్పారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ, పట్టణ అధ్యక్షుడు కేఎం విల్సన్ మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం ఇంకా రాష్ట్రంలో అమలులోకి రాలేదన్నారు. భూ వివాదాలకు ఆస్కారం లేకుండా చక్కని పరిష్కారం కోసమని రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వేను చేపట్టిందని ప్రభాకర్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికి 4 వేల గ్రామాల్లోనే సర్వే పూర్తయిందనీ, మరో 13 వేల గ్రామాల్లో జరగాల్సి ఉందన్నారు. రీసర్వే పూర్తయ్యాకనే భూ హక్కుల చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుందని వివరించారు. వాస్తవానికి ఈ చట్టం భూమి యాజమాన్య హక్కులకు రక్షణ కవచమని చెప్పారు. ఓడిపోతామనే ఆందోళనతో కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని కేఎం విల్సన్ సూచించారు. ఎవరెంతగా విషప్రచారం చేసినా ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తారని స్పష్టంచేశారు. మాజీ ఏపీపీ గువ్వల పద్మావతి, మాజీ ఏజీపీ తాడిబోయిన బుచ్చిరాజు, లీగల్‌సెల్ న్యాయవాదులు గుమ్మడి రవిరాజ్, షేక్ ఖాదర్ హుస్సేన్, తాడిబోయిన నాగార్జున, పిల్లి ప్రేమరాజ్, టి.సాంబశివరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

గుంటూరు ఈస్ట్: వైఎస్సార్ సీపీ కార్యకర్తపై కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి సోమవారం దాడిచేశాడు. బాధితుడు చీదర్ల రాజేష్‌బాబు తెలిపిన వివరాలు.. శారదా కాలనీ 19వ లైనులో చీదర్ల రాజేష్‌బాబు, మహబూబ్, సాల్మాన్, చిన్నబ్రహ్మయ్య పార్టీ కరపత్రాలు పంపిణీ చేస్తూ గడప గడపకు వెళ్లి నూరిఫాతిమాను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో తమ అనుచరులతో అటువైపు వచ్చిన షేక్ మస్తాన్‌వలి, రాజేష్‌బాబును పిలిచి వైఎస్సార్ సీపీకి ఎందుకు ప్రచారం చేస్తున్నావంటూ ప్రశ్నించాడు. రాజేష్‌బాబు తగిన సమాధానం చెప్పాడు. అయితే మస్తాన్‌వలి రాజేష్‌బాబును దుర్భాషలాడాడు. కులం పేరుతో దూషించి దాడి చేశాడు. మస్తాన్‌వలి రాజేష్‌ను దూషించడంతోపాటు, తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాను దుర్భాషలాడాడు. గాయాలపాలైన రాజేష్‌బాబు జీజీహెచ్‌లో చికిత్స పొందిన అనంతరం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వైఎస్సార్‌సీపీ నగర ఎస్సీ సెల్ నాయకుడు మల్లవరపు రవిరాజా, నాయకులు నాహిద్, అగ్గిపెట్టె రాజు, రఫీ, కిరణ్‌లు జీజీహెచ్‌కు వచ్చి రాజేష్‌బాబును పరామర్శించారు.